క్లుప్తంగా

ఒత్తిడిని అధిగమిస్తేనే మంచి ఫలితాలు



విద్యార్థులకు హాల్‌టికెట్లు పంపిణీ చేస్తున్న డీఈఓ శేఖర్

వడమాలపేట: పదో తరగతి విద్యార్థులు ఒత్తిడిని అధిగమిస్తేనే మంచి మార్కులు సాధించగలరని డీఈఓ శేఖర్ అన్నారు. మండల పరిధిలోని వడమాలపేట బాలికల పాఠశాల, తడుకు ఆర్ఎస్ జెడ్పీ పాఠశాలను శుక్రవారం తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థుల సమర్థాలను పరిశీలించారు. ఒత్తిడి, ఆందోళనకు గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు హాల్‌టికెట్లు పంపిణీ చేశారు. ఎంఈఓ పద్మావతి, ప్రధానోపాధ్యాయులు రఘురామయ్య, భువనేశ్వరి ఉన్నారు.

సీతారాములకు ప్రత్యేక పూజలు



జీడీనెల్లూరులో సీతారాముల ఊరేగింపు

గంగాధరనెల్లూరు: మండలంలోని దిగపూరు గ్రామంలో ఉన్న సీతారాముల భజన మందిరంలో శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలు, వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. సాయంత్రం శ్రీసీతారాముల చిత్రపటాన్ని పుష్పపల్లకిపై ఆశీనులను చేసి మేళతాళాలు, బాణాసంచా పేలుళ్ల నడుమ గ్రామ వీధుల్లో ఊరేగించారు. సీతారాములను కీర్తిస్తూ భజనలు చేశారు. ఇంటింట కర్పూర హారతులిచ్చి టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

వేడుకగా శ్రీవారి కల్యాణోత్సవం



పూజలు చేస్తున్న అర్చకులు

గంగాధరనెల్లూరు: వేపంజేరిలోని శ్రీలక్ష్మీనారాయణస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేపట్టారు. మూలవర్లను అభిషేకించి ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు దర్శనం కల్పించారు. మధ్యాహ్నం 12 గంటలకు లక్ష్మీనారాయణ స్వామి, శ్రీదేవి, భూదేవి ఉత్సవమూర్తులను ఊరేగింపుగా శ్రీవారి కల్యాణ మండపానికి వేంచేపు చేశారు. శాస్త్రోక్తంగా కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

ఎన్ఎంఎంఎస్‌కు విద్యార్థుల ఎంపిక

కార్వేటినగరం: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌నకు డైట్ మోడల్ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం గాజుల నాగేశ్వరరావు తెలిపారు. పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులు పి.గీతిక, ఎం.మోహన ప్రియ ఎంపికైనట్లు చెప్పారు. వీరికి నాలుగేళ్ల పాటు నెలకు రూ. వెయ్యి చొప్పున ఏడాదికి రూ.12 వేల ఉపకార వేతనం అందుతుందని వెల్లడించారు. విద్యార్థులను డైట్ ప్రిన్సిపల్ ప్రభాకర్ అభినందించారు.

చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

పాలసముద్రం: వేసవి నేపథ్యంలో చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సీడీపీఓ పద్మ సునందన అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. శుక్రవారం పాలసముద్రం అంగన్‌వాడీ కేంద్రంలో మండల పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. ఎండలో తిరిగితే జరిగే నష్టాలు.. తీసువాల్సిన జాగ్రత్తలను తల్లిదండ్రులకు వివరించాలని తెలిపారు. పిల్లల ఎదుగుదలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. రక్తహీనతతో ఉన్న గర్భిణులను గుర్తించి వైద్య సేవలు అందించాలని సూచించారు. సమావేశంలో సూపర్‌వైజర్ రాధ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు

పాలసముద్రం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటర్ వ్యవస్థ ద్వారా ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు చేరవేస్తున్నారని జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్, నూతనంగా ఎంపికైన పార్టీ మండల కన్వీనర్ ఎస్ తులసిరామ్ అన్నారు. శుక్రవారం పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ బాబు, ఎంపీడీఓ శ్రీనివాసన్, ఏఓ ఢిల్లీప్రసాద్, ఏపీఓను కలిసి సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ గాలిమహేష్ బాబు, అయ్యప్ప, నాయకులు బాబు, ఆనందన్, రవిరెడ్డి, పద్మనాధనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ బడ్జెట్ అంచనా రూ. 53.24 కోట్లు

- వడ్డీ మినహాయింపుతో రూ.2.60 కోట్లు పన్ను వసూలు
- పన్ను వసూళ్లలో చివరి స్థానం నుంచి 2వ స్థానానికి నగరి మున్సిపాలిటీ
- మున్సిపల్ సమావేశంలో చైర్మన్ పీజీ నీలమేఘం
- ముఖ్యమంత్రికి, మంత్రి ఆర్కేరోజాకు కృతజ్ఞతలు తెలిపిన కౌన్సిల్
- ప్రతి సచివాలయానికి ఒక స్ప్రేయర్ – మున్సిపల్ కమిషనర్



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్



హాజరైన కౌన్సిలర్లు, అధికారులు

నగరి: మున్సిపాలిటీలో 2023–24 సంవత్సరానికి రూ.53.23 కోట్లు అంచనా బడ్జెట్‌ను రూపొందించినట్లు మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం తెలిపారు. శుక్రవారం నగరి మున్సిపల్ కార్యాలయంలో బడ్జెట్, సాధారణ సమావేశం నిర్వహించారు. నూతన బడ్జెట్ కాపీలను అధికారులు కౌన్సిల్ సభ్యులకు అందజేశారు. ఆదాయం సమకూరే మార్గాలు.. వాటిని ఏ అభివృద్ధి పనులకు వినియోగించనున్నారన్న అంశాలను పొందుపరిచారు. మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి బడ్జెట్ వివరాలను సభ్యులకు వివరించారు. ఈ ఏడాదిలో ప్రారంభ నిల్వగా రూ. 4.03 కోట్లుందని, ప్రభుత్వ నిధులు, ఇతర ఆదాయాల ద్వారా రానున్న ఏడాదికి రూ. 45.21 కోట్లు ఆదాయం రానుందని తెలిపారు. మొత్తం అంచనా ఆదాయం రూ. 53.24 కోట్లని పేర్కొన్నారు. ఇందులో అభివృద్ధి పనులకు రూ.48.96 కోట్లు అంచనా కేటాయింపులు చేశామన్నారు. కౌన్సిలర్ దయానిధి మాట్లాడుతూ.. గతంలో మున్సిపల్ పరిధిలో రికార్డులు సక్రమంగా లేని కారణంగా తొలగిపోయిన పెన్షన్లలో అర్హులైన వారికి మళ్లీ పెన్షన్లు వచ్చేలా చేసినందుకు, అలాగే నేత సామాజిక వర్గం వారికి విద్యుత్ బిల్లుల కేటగిరి మార్చినా మళ్లీ పాత విధానంలోనే విద్యుత్ బిల్లులు చెల్లించేలా చేసినందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి, మంత్రి ఆర్కే రోజాకు కృతజ్ఞతలు తెలిపారు. అధికారులు పారిశుధ్య పనులు చేయించాలని.. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ సమాధానమిస్తూ ముఖ్యమంత్రి, మంత్రి అందించిన సహకారంతో ప్రతి సచివాలయానికి ఒక స్ప్రేయర్ సిద్ధం చేస్తున్నామని.. ప్రతి వీధిలో ఫాగింగ్ చేయిస్తామన్నారు. మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ.. 2005లో మున్సిపాలిటీ ఏర్పడిందని ఇప్పటి వరకు బకాయిలపై 100 శాతం వడ్డీ మినహాయింపు ఎవ్వరూ చేయలేదన్నారు. వడ్డీ మినహాయించడంతో రూ.2.60 కోట్ల మేర పన్ను వసూలైందన్నారు. రూ. 57 లక్షలు మాత్రమే బకాయి కింద ఉందన్నారు. వసూళ్లలో నగరి మున్సిపాలిటీ జిల్లాలో 2వ స్థానానికి చేరుకుందన్నారు. సంతమైదానంలో గుడ్‌విల్ బేసిస్‌లో గ్రౌండ్ ఫ్లోర్ వరకు 32 షాపులున్న విధంగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించేందుకు అనుమతుల కోసం పంపుతున్నామని తెలిపారు. ఇంతలా వసూలు కావడానికి కారణమైన ముఖ్యమంత్రికి, మంత్రి ఆర్కే రోజాకు చైర్మన్‌తో పాటు కౌన్సిల్ కృతజ్ఞతలు తెలిపింది. సమావేశంలో వైస్ చైర్మన్లు వెంకటరత్నం, బాలన్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మేనేజర్ శేఖర్, డీఈ నరేష్, టీపీఓ నీరజాక్షి, మెప్మా అధికారి సునీత తదితరులు పాల్గొన్నారు. ఈ ఆర్థిక సంవత్సరానికి చివరి సమావేశం కావడం, పన్ను వసూళ్లలో సిబ్బంది చురుగ్గా వ్యవహరించడంతో మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి సిబ్బందికి, కౌన్సిల్‌కు విందుభోజనం పెట్టారు.

2023–24 సంవత్సరానికి అంచనా

	రానున్న నిధులు (కోట్లలో)	చేపట్టనున్న అభివృద్ధి పనులు
సాధారణ నిధులు	0.35	రోడ్లు, భవనాలు
15వ ఫైనాన్స్	21.76	పార్కు
ఎంపీ ల్యాడ్స్	1.85	లైటింగ్ నిర్వహణ
ఏఎస్సీ నిధులు	0.75	బోర్లు, నిర్వహణ
ఎస్సీ,ఎస్టీ సబ్‌ప్లాన్	2.15	డ్రైయిన్, కల్వర్టు
స్వచ్ఛభారత్	0.40	మున్సిపల్ కార్యాలయం
ఎస్‌డీఎస్ నిధులు	2.35	శ్మశాన వాటికలు
ఎస్‌డీఎఫ్	1.25	
ఎస్ఎఫ్‌సీ	1.00	
మున్సిపల్ అభివృద్ధి	0.80	
ఈఐయూఎస్ గ్రాంట్	0.40	

అధికార నంది వాహనంపై కరకంఠేశ్వరుడు



నగరి: పట్టణ పరిధిలోని కామాక్షీ సమేత కరకంఠేశ్వర ఆలయంలో నిర్వహిస్తున్న పంగుణోత్తర బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం కరకంఠేశ్వర స్వామిని అధికార నంది వాహనంపై ఊరేగించారు. ఉపాధ్యాయులు చెందాలు వేసుకుని రూ.2.5 లక్షలతో తయారు చేయించిన అధికార నందివాహనం తొలిసారిగా ఈ ఉత్సవాల్లో వినియోగించారు. ఈ సందర్భంగా ఆలయంలో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఊరేగింపుగా వచ్చిన స్వామివారికి కొబ్బరికాయలు కొట్టి, కర్పూర హారతులు ఇచ్చి భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త సుబ్రమణ్యం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మహిళలు

నగరి: మున్సిపల్ పరిధిలోని ఏకాంబరకుప్పం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వద్ద శుక్రవారం డ్వాక్రా మహిళలు సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మూడో విడత ఆసరా వడ్డీ బ్యాంకు ఖాతాలకు జమ కావడంతో 13, 14 వార్డులోని మహిళలు సంబరాలు చేసుకున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఎన్‌సీ ఆనంద్ కుమార్, ఢిల్లిబాబు, సీఓ హిమబిందు, టీఎన్‌సీ సునీత, వెల్ఫేర్ సెక్రటరీ వెంకటరమణ, మహిళా పోలీస్ లక్ష్మి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శిలువ యాత్ర



శిలువ యాత్ర నిర్వహిస్తున్న క్రైస్తవులు

నగరి: రానున్న గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకుని క్రైస్తవులు శుక్రవారం శిలువ యాత్రను నిర్వహించారు. బస్టాండ్ ప్రాంగణం నుంచి చావడి ప్రాంతంలోని సీఎస్ఐ వెస్ట్ ఫాస్టరేట్ చర్చి వరకు యాత్ర సాగింది. శిలువను మోసుకొస్తున్న ఏసు ప్రభువును భటులు హింసించే సంఘటనను ప్రతిబింబించేలా ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో పాస్టర్లు, క్రైస్తవ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం



చిరుధాన్యాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

నింద్ర: చిరుధాన్యాలు తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఎంపీపీ దీప అన్నారు. శుక్రవారం నింద్ర వెలుగు కార్యాలయంలో అంగన్‌వాడీ సిబ్బంది ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. చిరుధాన్యాలు తీసుకోవడం ద్వారా కలిగే లాభాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వేణు, వైద్యాధికారి కళ్యాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బేబి పాల్గొన్నారు.

పరస్పర సహకారం అవసరం

నగరి: ఉపాధ్యాయులు పరస్పర సహకారంతో పనిచేయాలని ఎంఈఓ శ్రీదేవి అన్నారు. శుక్రవారం మండలంలోని ఎం.కొత్తూరు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల పఠన నైపుణ్యాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. వంట వారికి పలు సూచనలు చేశారు. ఉపాధ్యాయుల బోధనా విధానాన్ని పరిశీలించిన అనంతరం వారితో సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు సులభతరంగా అర్థమయ్యే విధంగా బోధన ఉండాలని సూచించారు. ఇంగ్లిష్ బోధనా విధానం మెరుగుపరచుకోవాలన్నారు.

ప్రణాళికతోనే విజయం సాధ్యం

పాలసముద్రం: ప్రణాళిక, క్రమశిక్షణతో చదివితేనే విజయం సాధ్యమని ఎంఈఓ రాజేంద్రప్రసాద్ అన్నారు. శుక్రవారం వెంగళరాజుకుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం నిర్వహించారు. పదో తరగతి చాలా కీలకమని.. బాగా చదువుకుని మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. విద్యారంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఇంగ్లిష్ మాధ్యమాన్ని అభ్యసించాల్సిన అవసరం ఉందన్నారు. హెచ్‌ఎం చక్రధరరావ్‌తో కలిసి విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ లబ్ధి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

–డిప్యూటీ సీఎం నారాయణస్వామి

కార్వేటినగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలకు ప్రజలు నీరాజనాలు పలుకుతున్నారని ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. శుక్రవారం కార్వేటినగరం పరిధిలోని తూర్పు అరుంధతివాడ, చాకలివానిగుంట, రెడ్డిండ్లు, వడ్డిఇండ్లు బండ్రేవుకాలనీ, సుద్ధగుంట, గాజుల కండ్రిగ, చింత తోపు ఎస్టీ కాలనీల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నారాయణస్వామి మాట్లాడుతూ.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని చెప్పారు. అర్హత ఉన్న ప్రతి ఒక్క కుటుంబానికి ఇల్లు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో దుస్థితికి చేరుకున్న రోడ్ల పునర్నిర్మాణం కోసం ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. గ్రామస్తులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. డ్రైనేజీ కాలువలపై మూతలు ఏర్పాటు చేయాలని కోరారు. ఉద్యోగ అవకాశాలు కల్పించాలని పలువురు విజ్ఞప్తి చేశారు. స్పందించిన మంత్రి శ్రీరంగరాజపురం మండలంలో నిర్మిస్తున్న కంపెనీలో అర్హులైన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మోహన్‌మురళి, తహసీల్దార్ పుల్లారెడ్డి, ఎంపీపీ లత, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, రాష్ట్ర యువత ప్రధాన కార్యదర్శి ధనంజయవర్మ, మండల కన్వీనర్ శేఖర్‌రాజు, కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ గోపి, మాజీ ఏఎంసీ చైర్మన్ క్రిష్ణయ్య, శివప్రకాష్, చందురాజు, నాగయ్య, హౌసింగ్ డీఈ వెంకటేశ్వర్లు, విద్యుత్ ఏడీఈ నాగరాజు, ఏఈ నాగభూషణం, సర్పంచ్ ధనంజయవర్మ పాల్గొన్నారు.

నేడు బిల్లుదొన్నలో

మండల పరిధిలోని బిల్లుదొన్న ఎస్టీ కాలనీ నుంచి శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కొనసాగుతుందని పార్టీ మండల కన్వీనర్ శేఖర్‌రాజు తెలిపారు. ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి గ్రామంలో పర్యటిస్తారని చెప్పారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి స్థానిక సమస్యలు తెలుసుకుంటారన్నారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

బార్ కౌన్సిల్ నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గంతో జడ్జి విష్ణువర్మ

నగరి: జూనియర్ సివిల్ జడ్జి, జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు బార్ కౌన్సిల్‌కు నూతన కార్యవర్గ సభ్యులను శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బార్ కౌన్సిల్ అధ్యక్షుడిగా మణివాసగం, ఉపాధ్యక్షుడిగా కె.వేలాయుధం, కార్యదర్శిగా ఎస్.జాన్ జోష్, ఉపకార్యదర్శిగా కె.రాము, కోశాధికారిగా ఎం.నాగరాజు ఎన్నికయ్యారు. జడ్జి విష్ణువర్మ నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు. ప్రశాంత వాతావరణంలో కోర్టు పనులు సాగడానికి నూతన కార్యవర్గం సహకరించాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు సుబ్రమణ్యం రెడ్డి, మురళీధర్, మహాదేవన్, బాబు, ఉదయభాను, జగదీష్, హనీఫా, చిరంజీవులు, పన్నూరు బాబు ధరణి పాల్గొన్నారు.

ముస్లింల అభ్యున్నతికి కృషి



పూడిలో షాదీ మహల్‌కు భూమి పూజ చేస్తున్న రాంప్రసాద్‌రెడ్డి

వడమాలపేట: ముస్లింల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని పర్యాటకశాఖ మంత్రి ఆర్కే రోజా సోదరుడు, వైఎస్సార్‌సీపీ నేత రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పూడి సచివాలయం పరిధిలో షాదీమహల్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఏ నియోజకవర్గంలో చేయని విధంగా మసీదుల మరమ్మతులకు రూ. 2 కోట్లు మంజూరు చేయించిన ఘనత మంత్రి రోజాకే దక్కుతుందన్నారు. పుత్తూరులో షాది మహల్ నిర్మాణానికి సుమారు రూ. 2 కోట్లు మంజూరు చేయించారని తెలిపారు. వైఎస్ జగన్ పుట్టిరోజు సందర్భంగా నగరి మండలంలోని మీరాసాహెబ్ గ్రామాన్ని దత్తతకు తీసుకుని రోజా చారిటబుల్ ట్రస్టు ద్వారా మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. చారిటబుల్ ట్రస్టు ద్వారా అనేక సహాయ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

అంజేరయ్య కుంటుబానికి పరామర్శ

కాయంపేట అంబేడ్కర్ కాలనీకి చెందిన అంజేరయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రాంప్రసాద్‌రెడ్డి ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. అన్ని విధాల అదుకుంటామని తెలిపారు. తహసీల్దార్ సుబ్రమణ్యం, మైనారిటీ కార్పొరేషన్ డైరెక్టర్ మహీన్, బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ రేణుక, డీసీసీబీ డైరెక్టర్ కరుణాకర్‌చౌదరి, వైస్ ఎంపీపీ లోకేష్ రెడ్డి, కాయం సింగల్ విండో అధ్యక్షుడు సుధీర్ రెడ్డి, సర్పంచ్‌లు శ్రీవిద్య, లలిత్‌కుమార్, ఎంపీటీసీ రవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



వివిధ వేషధారణలో విద్యార్థులు



మాట్లాడుతున్న తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ హేమ

శ్రీరంగరాజపురం: మండలంలోని 49కొత్తపల్లిమిట్ట జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ హేమ మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయురాలు లలితకూమారి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా హోమ పూజలు





హోమ పూజలు చేస్తున్న వేదపండితులు, బాలగురునాథీశ్వరస్వామి

పాలసముద్రం: మండలంలోని రాచపాల్యంలో వెలసిన బాలగురునాథీశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం హోమ పూజలు నిర్వహించారు. సాయంత్రం యాగశాలలో ఉంచిన కలశ నీటితో స్వామివారికి అభిషేకాలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

అందరి సహకారంతోనే మండల అభివృద్ధి

–ఎంపీపీ దీప



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ దీప

నింద్ర: మండల అభివృద్ధికి అందరూ భాగస్వాములు కావాలని ఎంపీపీ దీప అన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. అర్హులైన వారికి పింఛన్లు, ఇళ్లు, సంక్షేమ పథకాలు అందేలా చూడాలని అధికారులకు సూచించారు. పాదిరి సర్పంచ్ సూర్య మాట్లాడుతూ.. పంచాయితీలో శ్మశానికి దారి సౌకర్యం కల్పించాలని కోరారు. ఆరూరు ఎంపీటీసీ రమ్య మాట్లాడుతూ.. భవన నిర్మాణాలు పూర్తి చేస్తున్నా బిల్లులు సక్రమంగా అందడం లేదని తెలిపారు. కోఆప్షన్ సభ్యుడు అనిల్ మాట్లాడుతూ.. విద్యుత్ మోటార్ కోసం ట్రన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు నగదు చెల్లించినా ఇంత వరకు స్పందన లేదని వాపోయారు. ఫలితంగా కొప్పెడు దళితవాడలో తాగునీటి సమస్య నెలకొందని తెలిపారు. మేళంబాకం గ్రామం నుంచి ఆదిఆంధ్రవాడ మార్గంలో కాల్వర్టు నిర్మించాలని సర్పంచ్ బాలకృష్ణంరాజు కోరారు. ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ వేణు, వైస్ ఎంపీపీ శుభా, ఎంపీటీసీ విజేష్, రమ్య, మంజుల, సింగిల్‌విండో అధ్యక్షుడు మునికృష్ణారెడ్డి, సర్పంచ్‌లు వసంతమ్మ, గౌరి, పుబ్రమణ్యంరాజు, మహేష్, మలర్‌వాణి, ఎంఈఓ నారాయణ, వైద్యాధికారి కళ్యాణి, ఏఈలు పాల్గొన్నారు.

సమన్వయంతో పార్టీని బలోపేతం చేద్దాం



వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పద్మనాభరెడ్డిని సన్మానిస్తున్న నేతలు

వెదురుకుప్పం: ఐక్యతతో పనిచేసి మండలంలో వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేద్దామని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. పార్టీ మండల అధ్యక్షుడిగా నియమితులైన కామసాని పద్మనాభరెడ్డి శుక్రవారం పదవీ బాధ్యతలు తీసుకున్న నేపథ్యంలో వెదురుకుప్పంలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకు అతీతంగా సంక్షేమ ఫలాలు అందిస్తున్న క్రమంలో గతంలో కంటే రానున్న ఎన్నికల్లో 15 వేలు పైచిలుకు ఓట్ల మెజారిటీ రావడం కోసం ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలన్నారు. విభేదాలను పక్కన పెట్టి గెలుపే లక్ష్యంగా ముందుకుసాగాలని సూచించారు. పద్మనాభరెడ్డి మాట్లాడుతూ.. గ్రామ స్థాయి నుంచి ప్రతి ఒక్కరిని కలుపుకుని పార్టీని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. మరోసారి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకోవాలన్నారు. అందరి అభీష్టం మేరకు నడుచుకుని ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామికి మంచి పేరు తీసుకొస్తానన్నారు. అనంతరం ఆయన్ను పార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగరాణి, జెడ్పీటీసీ సుకుమార్, ఏఎంసీ చైర్మన్ లోకనాథ రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండి హేమసుందర్‌రెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బట్టే సుబ్రమణ్యం, కో–ఆప్షన్ సభ్యుడు వెంకటేశ్, ఎంపీటీసీలు మునిచంద్రారెడ్డి, భాస్కర్, సర్పంచ్‌లు బాబు, శ్రీనాథరెడ్డి, బూత్‌కమిటీ కన్వీనర్ కేశవులు రెడ్డి, నాయకులు రామయ్య, భీమశంకర్‌రెడ్డి, రోశిరెడ్డి, గురవారెడ్డి తదితరులు పాల్గొన్నారు.